
సాక్షి ఖమ్మం

మంగళవారం । 28 । మార్చి । 2023




యూనిఫాం వచ్చేసింది!
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇచ్చే యూనిఫాం క్లాత్ చేరుకోగా మండలాల వారీగా పంపిస్తున్నారు.
8లో



బందోబస్తుకు ప్రణాళిక
భద్రాచలంలో శ్రీరామనవమి సందర్భంగా పోలీసులు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేయడమే కాక బందోబస్తుపై దృష్టి సారించారు.
8లో



వాతావరణం
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది.



న్యూస్‌రీల్

ఘనంగా శ్రీవారి ఎదుర్కోలు ఉత్సవం



హోమం చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా స్వామి అభిషేకం చేశాక, పుణ్యాహవచనం, అనుష్టానాలు, హోమం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మ వార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యానం జరిపించారు. ఇక సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం ఏర్పాటుచేసిన అర్చకులు ఎదురెదురుగా కూర్చుని స్వామి, అమ్మ వార్ల గుణగణాలను భక్తుల సమక్షాన వినిపించారు. అలాగే, చంద్రప్రభ వాహనంపై ఆలయ గిరి ప్రదక్షణ చేయించారు. ఈఓ కె.జగన్మోహన్ రావు, ధర్మకర్తలు ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఉప్పల కృష్ణమోహన్‌శర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నేలకొండపల్లి: జిల్లాలో ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు. మండలంలోని సింగారెడ్డి పాలెం గురుకుల పాఠశాల, నేలకొండపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ పరీక్ష కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. పరీక్ష సమయాన సమీప జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. జిల్లాలో పరీక్షలు పకడ్బందీగా సాగేలా ఫ్లయింగ్, హైపవర్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్లు డీఐఈఓ తెలిపారు.

608 మంది గైర్హాజరు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా కొనసాగాయి. ఈమేరకు 15,872మంది విద్యార్థులకు గాను 15,264మంది హాజరయ్యారని.. 608మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ రవిబాబు తెలిపారు.

ఇస్రోలో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులను ప్రోత్సహించేందుకు చేపట్టిన యంగ్ సైంటిస్ట్, యువ విజ్ఞాని కార్యక్రమం(యువిక) కింద దరఖాస్తుకు వచ్చే నెల 3వ తేదీ వరకు గడువు ఉందని జిల్లా సైన్స్ అధికారి సైదులు తెలిపారు. ఇస్రో ఆధ్వర్యాన ఇచ్చే శిక్షణ కోసం ఆసక్తి కలిగిన 9వ తరగతి విద్యార్థులు ఇస్రో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన వారికి మే నెలలో రెండు వారాల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు.

పంట నష్టంపై వివరాలు సేకరణ



దెబ్బతిన్న మొక్కజొన్న పంట (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: ఇటీవల అకాల వర్షాల కారణంగా జిల్లాలో జరిగిన పంట నష్టం వివరాల సేకరణలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఈదురుగాలులతో కూడిన వర్షంతో జిల్లాలో సాగు చేసిన యాసంగి పంటలకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా కోతకు వచ్చిన మొక్కజొన్న నేలవాలగా, జిల్లాలో 19,732 మంది రైతులకు చెందిన 31,038 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా గుర్తించారు. తాజాగా సీఎం కేసీఆర్ జిల్లాలో పర్యటించిన దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించనున్నట్లు ప్రకటించారు. రైతులతో పాటు కౌలు రైతులకు కూడా పరిహారం చెల్లిస్తామని పేర్కొన్నా ఇంకా మార్గదర్శకాలు విడుదల కాలేదు. ఈ నేపథ్యాన అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ 33 శాతం మేర పంట నష్టపోయిన ప్రాంతాల్లో సర్వే నంబర్, సాగు చేసిన విస్తీర్ణం, పంట, రైతు, కౌలు రైతు వివరాలు, బ్యాంక్ అకౌంట్ వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు.

మిల్లింగ్ ఇక్కడ కాదు!



వచ్చే నెల రెండో వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- ఇక్కడి మిల్లుల్లో నిల్వ సామర్థ్యం లక్ష మెట్రిక్ టన్నులే...
- ఫలితంగా ఇతర జిల్లాలకు తరలనున్న ధాన్యం
- పడిగాపుల బాధ, కోతలు లేకుండా చూడాలంటున్న రైతులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: గత వర్షాకాలంలో అంచనాలకు మించి కురవడంతో జిల్లాలోని జలాశయాలతో పాటు భూగర్భ జలాలు కూడా సమృద్ధిగా ఉన్నాయి. దీంతో ప్రస్తుత యాసంగిలో రైతులు వరి సాగు చేశారు. ఇప్పుడిప్పుడే కోతలు మొదలవుతుండగా ఈసారి దాదాపు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని అధికారులు నిర్ణయించారు. అయితే జిల్లాలోని మిల్లుల్లో కేవలం లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే నిల్వ చేసుకునే సామర్థ్యం ఉండగా.. మిగతా ధాన్యాన్ని ఇతర జిల్లాల్లోని మిల్లులకు కేటాయించాలనే భావనకు వచ్చారు. గత యాసంగి మినహా అన్ని సీజన్లలో అధికంగా వచ్చిన ధాన్యాన్ని ఇలాగే చేశారు. కానీ తరలించడంలో ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు వాహనాలు కేటాయిస్తూ తాము పడిగాపులు పడకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆశాజనకంగా దిగుబడి

ఈ ఏడాది యాసంగి సీజన్‌లో 2,05,762 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పంట చేతికి వచ్చే సమయాన అకాల వర్షాలు దెబ్బతీసినా దిగుబడి ఆశాజనకంగానే ఉంటుందని భావిస్తున్నారు. రెండున్నర ఎకరాల్లో 6,180 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అనుకున్నా.. జిల్లా మొత్తంగా 5,08,645 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందనేది అంచనా. ఇందులో స్థానిక అవసరాలకు 54,627 మెట్రిక్ టన్నుల ధాన్యం, విత్తనాల కోసం మరో 20 వేల మెట్రిక్ టన్నులు పోగా.. మిగిలిన 4,34,018 మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు అమ్మకానికి వస్తుందని భావిస్తున్నారు. ఇక 34,018 మెట్రిక్ టన్నులు మిల్లర్లు కొనుగోలు చేస్తారని, అవిపోగా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని పౌర సరఫరాల సంస్థ నిర్ణయించింది.

రెండో వారం నుంచి కొనుగోళ్లు

ఏప్రిల్ రెండో వారం నుంచి జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. జిల్లాలో డీఆర్‌డీఏ(ఐకేపీ) ద్వారా 53, పీఏసీఎస్‌ల ద్వారా 148, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యాన 29, ఏఎంసీల నుంచి నాలుగు కలిపి మొత్తం 234 కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ ఇప్పటికే పౌరసరఫరాల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి, మార్కెటింగ్, సహకార శాఖ అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు.

ఈసారీ అదే పరిస్థితి

ఈసారి యాసంగిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేయగా.. జిల్లా మిల్లులకు కేటాయించగా మిగిలే ధాన్యాన్ని ఇతర జిల్లాలకు తరలించాల్సి వస్తుంది. అయితే, లారీల కేటాయింపు, తరలింపులో ఆలస్యం జరుగుతుండడంతో ఏటా ధాన్యం రాశుల వద్ద రైతులు పడిగాపులు కాయడం సర్వసాధారణమైపోయింది. అలాగే, పక్క జిల్లాల మిల్లులపై ఇక్కడి అధికారుల ఆజమాయిషీ లేకపోవడంతో తాలు, నాణ్యత పేరిట నిరాకరిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్‌ను మిల్లర్లు గడువులోగా ఇవ్వడం లేదు. మూడు నెలల్లో పౌర సరఫరాల సంస్థకు బియ్యం ఇవ్వాల్సి ఉన్నా గత యాసంగి ధాన్యానికి సంబంధించి ఇంకా 20 శాతం బియ్యం ఇవ్వలేదు. దీంతో గడువు పొడిగిస్తూ వెళ్తున్నారు. ఈసారైనా కొనుగోలు కేంద్రాల వద్ద జాప్యం జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని రైతులు కోరుతున్నారు.

గత యాసంగిలో 73 వేల మెట్రిక్ టన్నులే..

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాక అక్కడ మర ఆడించి పౌరసరఫరాల శాఖకు ఒప్పందం ప్రకారం 67 శాతం బియ్యం(సీఎంఆర్) అందజేయాల్సి ఉంటుంది. జిల్లాలో రా రైస్ మిల్లులు 57, బాయిల్డ్ రైస్ మిల్లులు ఏడు ఉండగా.. యాసంగి ధాన్యం ఎక్కువగా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలుతుంది. కానీ ఇటీవల కొన్ని రా రైస్ మిల్లులకు కూడా తరలిస్తున్నారు. గత యాసంగిలో కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో 10,951 మంది రైతుల నుంచి 73,967.880 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించగలిగారు. అంతకుముందు మాత్రం లక్ష మెట్రిక్ టన్నులు మొదలు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసిన సందర్భాలు ఉన్నాయి. దీంతో స్థానిక మిల్లులకు సరిపోగా.. మిగిలిన ధాన్యాన్ని భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, సూర్యాపేట, నల్లగొండ, వరంగల్ తదితర జిల్లాలకు తరలించారు.

కమనీయంగా క్రతువు



ధ్వజపటం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

భక్తి ప్రపత్తులతో ధ్వజపట లేఖనం

- శాస్త్రోక్తంగా కొనసాగుతున్న హోమాలు
- ముత్తంగి అలంకరణలో స్వామివారి దర్శనం
- ఉత్సాహంగా సాగిన సార్వభౌమ సేవ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం వేడుకల్లో భాగంగా యాగశాలలో శ్రీరామాయణ క్రతువును రుత్విక్‌లు, వేదపండితులు నిర్విఘ్నంగా జరిపిస్తున్నారు. చతుర్వేద హవనాలు, రామాయణ హవనం, రామషడాక్షరీ, నారాయణ అష్టాక్షరి మంత్రాలను జపించారు. అనంతరం రుత్విక్‌లు సంక్షేప రామాయణ సామూహిక పారాయణం నిర్వహించారు.

ఘనంగా గరుడాధివాసం..

వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గరుడాధివాసం, ధ్వజపట లేఖనం జరిపించారు. బ్రహ్మోత్సవాలకు ప్రధాన సంకేతమైన గరుత్మంతుడి బొమ్మను వస్త్రంపై లిఖించారు. జీయర్ మఠంలో ఈ వేడుకను అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్తి చేశారు. అనంతరం అక్కడి నుంచి శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఉపాలయానికి తీసుకొచ్చి చిత్రపటానికి హారతి సమర్పించి పూజలు చేశారు. పూజల్లో త్రిదండి రామానుజ జీయర్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, స్థానాచార్యులు స్థలశాయి, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో మంగళవారం అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, చతు స్థానార్చన జరపనున్నారు. సంతానం లేని మహిళలు గరుడ ప్రసాదం స్వీకరిస్తే శుభ ఫలితాలు కలుగుతాయని భక్తుల నమ్మిక. కాగా, సాయంత్రం అర్చకులు సార్వభౌమ సేవ నిర్వహించారు.

ముత్తంగి రూపం.. నయనానందకరం



ముత్తంగి అలంకరణలో స్వామివారి ఉత్సవమూర్తులు

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని సోమవారం ముత్తంగి రూపంలో అలంకరించారు. హైదరాబాద్‌కు చెందిన దాతలు రూ. 30 లక్షల విలువైన కవచాలను అందజేయగా, స్వామివారికి ధరింపజేశారు. ముత్తంగి రూపంలో దర్శనమిచ్చిన స్వామివారిని తిలకించిన భక్తులు పరవశించి పోయారు. కాగా, స్వామివారిని త్రిదండి రామానుజ జీయర్ స్వామి సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు పరివట్టం కట్టి స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు, ఉపాలయాల్లో పూజలు చేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, జీయర్ మఠం నిర్వాహకులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి ఐటీసీ బియ్యం వితరణ

దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి ఐటీసీ పీఎస్‌పీడీ సంస్థ తరఫున ప్రతినిధులు 25 క్వింటాళ్ల బియ్యం వితరణగా ఈఓ రమాదేవికి అందజేశారు. ఏపీలోని రాజమండ్రికి చెందిన భక్తులు గోటి తలంబ్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. గిరి ప్రదక్షిణ అనంతరం ఈఓకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్



నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు, నాయకులు

- వైరా మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే రాములునాయక్
- రూ. 36.87 కోట్లతో బడ్జెట్‌కు ఆమోదం
- గైర్హాజరైన చైర్మన్.. కార్యాలయం వద్ద భారీ బందోబస్తు

వైరా: అందరి సహకారంతోనే వైరా మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాములునాయక్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ అనిత అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో విడుదలైన రూ.20 కోట్ల నిధులతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కాకుండా ప్రత్యేక వనరుల ద్వారా ప్రతీ వార్డును అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నామని గుర్తుచేశారు. ఇటీవల సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ.30 కోట్లతో మరిన్ని పనులు చేపట్టే అవకాశం లభించిందన్నారు. ఈ నిధులను కౌన్సిలర్ల అభీష్టం మేరకు వెచ్చిస్తామని తెలిపారు.


భారీ బందోబస్తు మధ్య బడ్జెట్ భేటీ

మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశానికి చైర్మన్ సూతకాని జైపాల్ గైర్హాజరయ్యారు. ఆయన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట నడుస్తుండడంతో అవిశ్వాస తీర్మానానికి గతంలోనే నోటీసు ఇచ్చారు. ఆతర్వాత బీఆర్‌ఎస్ నుంచి కూడా బహిష్కరించారు. ఈ నేపథ్యాన బడ్జెట్ సమావేశానికి చైర్మన్ రాకపోవడంతో కమిషనర్ అనిత అధ్యక్షత వహించారు. ఈమేరకు 2022–2023 ఆర్థిక సంవత్సరానికి రూ.36.87 కోట్ల అంచనా వ్యయంతో బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. కాగా, 4వ వార్డు కౌన్సిలర్ అయిన జైపాల్‌తో పాటు 20వ వార్డు కౌన్సిలర్ స్థానికంగా లేకపోవడంతో గైర్హాజరు కాగా, మిగతా 18 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈమేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం 8 గంటల నుండి వైరా, తల్లాడ, కొణిజర్ల ఎస్సైలతో పాటు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌పై కౌన్సిలర్లు పలు అవినీతి ఆరోపణలు చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడమే కాక ఇటీవల వాటర్ ట్యాంక్ కూల్చివేతపై కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీంతో మున్సిపల్ సిబ్బందిని విచారిస్తుండగా, సమావేశానికి మున్సిపల్ చైర్మన్ హాజరైతే పోలీసులు తీసుకెళ్లాలని భావించినట్లు తెలిసింది. కాగా, ఇటీవల పొంగులేటి శిబిరంలో చేరిన 4, 7, 8, 20వ వార్డుల్లో అభివృద్ధిపై కౌన్సిలర్ల ప్రమేయం లేకుండా ప్రతిపాదనలు చేయడంపై నిరసన తెలిపారు. ఏదిఏమైనా మున్సిపల్ చైర్మన్ జైపాల్ హాజరుకాకుండానే బడ్జెట్‌ను ఆమోదించడం గమనార్హం.

మున్సిపల్ చైర్మన్‌కు నోటీసులు

వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌కు కలెక్టర్ గౌతమ్ సోమవారం నోటీసులు జారీ చేశారు. గత నెల 22వ తేదీన చైర్మన్‌పై పలువురు కౌన్సిలర్లు అవినీతి ఆరోపణలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ నోటీసులు జారీ చేయగా ఆయన అందుబాటులో లేకపోవడంతో నివాసానికి రెవెన్యూ అధికారులు నోటీసులు అంటించారు. కాగా, రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

కల్యాణం, తెప్పోత్సవానికి రూ.21 లక్షలు



మాట్లాడుతున్న కమిషనర్ ఆదర్శ్‌సురభి, పక్కన సుడా చైర్మన్ విజయ్, మేయర్ నీరజ

ఖమ్మంఅర్బన్/ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం ఇందిరానగర్‌లోని పర్ణశాల శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో రాములోరి కల్యాణోత్సవం, తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేలా కేఎంసీ నుంచి రూ.21లక్షలు కేటాయించినట్లు కమిషనర్ ఆదర్శసురభి, మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. కేఎంసీతో పాటు ఆలయం వద్ద సోమవారం వేర్వేరుగా ఏర్పాటుచేసిన సమావేశాల్లో వారు మాట్లాడారు. కల్యాణోత్సవానికి 25వేల మంది భక్తులు తిలకించేలా ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. ఈనెల 30న ఉదయం కల్యాణం జరగనుండగా, సాయంత్రం 5గంటలకు ఆలయం నుంచి శోభాయాత్రగా లకారం ట్యాంక్‌బండ్‌కు చేరుకుని తెప్పోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. వేలాది మంది భక్తులతో శోభాయాత్ర సాగుతుందని, తెప్పోత్సవ వేదిక వద్ద భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. సుడా చైర్మన్ విజయ్, రామాలయం ఈఓ కాముని శ్రీకాంత్, ప్రధానార్చకులు శేష భట్టార్ పవన్‌కుమారాచార్యులుతో పాటు చావా నారాయణరావు, రావూరి సైదుబాబు, కొత్తా రవి, పల్లెబోయిన రవి,సత్యం, స్వర్ణ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మీ వల్లే ఇక్కడికి వస్తున్నారు..

- బోనకల్ ఎంపీడీఓపై కలెక్టర్ ఆగ్రహం

ఖమ్మం సహకారనగర్: 'మండల స్థాయిలో సమస్యలు పరిష్కరించలేకపోతున్నారు.. అందుకే ప్రతీ చిన్న సమస్యతో ప్రజలు కలెక్టరేట్‌కు వస్తున్నారు.. అర్థం చేసుకోరా మీరు.. చూస్తాం, చేస్తామని నాకే చెబుతున్నారంటే ఫిర్యాదుదారులతో ఎలా స్పందిస్తారో అర్థమవుతోంది... ఈరోజు రాత్రి 10గంటల్లోగా సమస్య పరిష్కరించి నివేదిక సమర్పించాల్సిందే..' అని బోనకల్ ఎంపీడీఓ వేణుమాధవ్‌పై కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి(గ్రీవెన్స్‌డే)లో భాగంగా ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా బోనకల్ మండలం రావినూతలకు చెందిన అనిల్‌కుమార్ తమ ఇంటి పక్కన వ్యక్తి రహదారిని ఆక్రమించడంతో దారి లేకుండా పోయిందని, ఒకటి, రెండు సార్లు అధికారులను కలిసినా సమస్య పరిష్కారం కాలేదని చెప్పగా కలెక్టర్ ఎంపీడీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆతర్వాత పలు ఫిర్యాదులపై మండలాల అధికారులతో ఆన్‌లైన్ ద్వారా మాట్లాడి సూచనలు చేశారు. గ్రీవెన్స్ డేలో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికా గుప్తా, డీఆర్వో శిరీష, కలెక్టరేట్ ఏఓ కారుమంచి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిపై ఉక్కుపాదం

కాంగ్రెస్ ఆధ్వర్యాన నిరసన దీక్ష



దుర్గాప్రసాద్ తదితరులతో దీక్ష విరమింపచేస్తున్న గోపాల్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: కేంద్రప్రభుత్వం ప్రశ్నించే వారిపై ఉక్కుపాదం మోపుతోందని పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆరోపించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై వేటు వేసిన నేపథ్యాన సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సత్యాగ్రహ సంకల్ప నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తను కలలు కన్న భారతదేశం కోసం అన్ని రాజ్యాంగ వ్యవస్థలను మోడీ నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రమాదం అంచున ఉన్న దేశం, పార్లమెంటరీ వ్యవస్థను కాపాడేందుకు అన్ని వర్గాల ప్రజలు పోరాడాలని కోరారు. రాహుల్‌గాంధీ ఇటీవల చేపట్టిన యాత్రకు ప్రజల్లో మంచి గుర్తింపు రావడం బీజేపీకి కంటగింపుగా మారిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, మలీదు వెంకటేశ్వర్లు, సైదులు, రాయల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రం, మొక్క శేఖర్ గౌడ్, పాలకుర్తి నాగేశ్వరరావు, సయ్యద్ గౌస్, అబ్బాస్ బేగ్ పాల్గొన్నారు.

ఆదాయం అదుర్స్...

- కేఎంసీకి పెరిగిన ఆస్తిపన్ను రాబడి
- ఈ ఏడాది రూ.31.24 కోట్లలో రూ.24.94 కోట్లు వసూలు
- మరో నాలుగు రోజుల్లో మిగతాది వసూలు చేసేలా కార్యాచరణ
- జీఎంహెచ్‌సీ మినహా రాష్ట్రంలోనే కేఎంసీకి మొదటి స్థానం



డిజిటల్ క్యూ ఆర్ కోడ్లు చూపిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి ప్రజలు చెల్లించే పన్నులే ప్రధాన వనరులు. ఇందులో అత్యధికంగా ఆస్తి, పంపు పన్నుల నుండే సమకూరుతుంది. ఈమేరకు ఖమ్మం కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో వసూళ్లు పెరిగాయి. 2021–22 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2022–23 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నులు ఇప్పటి వరకు 10 శాతం అదనంగా వసూలైనట్లు చెబుతున్నారు. దీంతో రాష్ట్రంలోనే జీహెచ్ఎంసీ మినహాయిస్తే మొదటి స్థానంలో ఖమ్మం కార్పొరేషన్ నిలిచింది.

రూ.24.94 కోట్లు ఆదాయం..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు పెరుగుతుండడంతో ఏటా పన్నుల డిమాండ్ పెరుగుతూ వస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో కేఎంసీకి ఆస్తి పన్నుల రూపంలో రూ.30 కోట్లకు గాను రూ.22 కోట్లు వసూలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం 70 వేల అసెస్మెంట్లకు సంబంధించి రూ.31.24 కోట్ల ఆస్తి పన్నులో ఇప్పటి వరకు రూ.24.94 కోట్లు వసూలు చేశారు. గతేడాదితో పోలిస్తే 10 శాతంపైగా ఇది అదనం.

సత్ఫలితాలను ఇస్తున్న ప్రయత్నాలు

ఆస్తి పన్నులతో పాటు పంపు పన్నుల బకాయిలు వసూళ్ల కోసం కేఎంసీ కమిషనర్ సహా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నోటీసులు జారీ చేయడమే కాక బకాయిదారులకు అవగాహన కల్పిస్తుండడంతో పన్ను చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి పన్ను చెల్లింపుదారులకు పోస్ట్ ద్వారా నోటీసులు పంపించడం, సెల్ నంబర్లకు మెస్సేజ్‌లు పంపిస్తుండడంతో పలువురు చెల్లించారు. గతేడాది పంపు పన్నుల లక్ష్యం రూ.8 కోట్లు ఉండగా.. కేవలం రూ.60 లక్షలు మాత్రమే రాబట్టగలిగారు. ఈఏడాది మాత్రం రూ.9 కోట్ల లక్ష్యంలో రూ.3 కోట్లకు పైగా వసూలు చేయడం విశేషం.

నాలుగు రోజులే..

2022–23 ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా నాలుగు రోజుల సమయం ఉంది. ఈ సమయంలో ఆస్తి పన్ను రూ.6 కోట్లు, పంపు పన్నులు రూ.6 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అధికారులు చేపట్టిన చర్యలతో మంచి ఫలితాలు వచ్చిన నేపథ్యాన మిగిలిన సమయంలో కూడా పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. గడువులోగా చెల్లించకుంటే ఏప్రిల్ 1వ తేదీ నుండి బకాయిలపై రెండు శాతం జరిమానా పడుతుందనే విషయంపై అవగాహన కల్పిస్తున్నారు. కాగా, ఖమ్మం మున్సిపాలిటీ నుండి కార్పొరేషన్‌గా మారాక పలు పంచాయతీలను విలీనం చేయడంతో సమాచారం అంతా అధికారులు ఆన్‌లైన్ చేశారు. ఈక్రమంలో తప్పులు దొర్లగా పన్ను చెల్లించిన వారు కూడా బకాయి ఉన్నట్లు నోటీసులు అందాయి. ఇలా కేఎంసీలో 655 దరఖాస్తులు రాగా.. వీటిల్లో 547 దరఖాస్తులను పరిష్కరించారు.

పన్నులు చెల్లించి సహకరించండి..

ప్రజలు చెల్లించే పన్నులతోనే అభివృద్ధి జరుగుతుంది. ఈ విషయాన్ని గుర్తించి సకాలంలో పన్నులు చెల్లించడం ద్వారా నాణ్యమైన మరిన్ని సేవలు పొందాలి. ఇంకా నాలుగు రోజుల గడువే ఉన్నందున పన్నులు, బకాయిలు చెల్లిస్తే జరిమానా నుంచి మినహాయింపు పొందొచ్చు.

– ఆదర్శ్ సురభి, కమిషనర్

క్లుప్తంగా

నేటి ధర్నాను జయప్రదం చేయండి

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులు, ఎయిడెడ్ ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించడమే కాక ప్రతినెల 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని డిమాండ్‌తో మంగళవారం హైదరాబాద్ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) బాధ్యులు వెల్లడించారు. ఈ ధర్నాకు జిల్లా నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలని టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ. నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావు, ఎస్.విజయ్ వేర్వేరు ప్రకటనల్లో కోరారు.

దూదేకుల సమస్యలపై పోరాట కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ బాషా

ఖమ్మం మామిళ్లగూడెం: దూదేకుల కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాట కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలంగాణ నూర్‌బాషా, దూదేకుల ముస్లిం, మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా తెలిపారు.ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులాన్ని అడ్డుపెట్టుకుని స్వలాభం కోసం ప్రయత్నిస్తున్న ముస్తఫా, అన్వర్, ఖలీం, బడే సాహెబ్, సలీంను సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసమావేశంలో నాయకులు ఎస్.కే.రహీం, సిద్దుబాషా, రహీం బాషా, సైదాహుస్సేన్, మౌలానా, దర్గా సాహెబ్, సైదులు, రసూల్, ఎస్.కే.సకీనా, లాల్ సాహెబ్, ఎస్.కే.మౌలానా పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా సందీప



సందీపను సన్మానిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం లీగల్: ఖమ్మం శ్రీనివాసనగర్‌కు చెందిన న్యాయవాది కొప్పుల రాము కుమార్తె సందీప జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2021లో లా పూర్తి చేసిన ఆమె తెలంగాణ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. ఖమ్మం బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం స్వీకరించి ప్రాక్టీస్ చేస్తూ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి రామారావు, తులసి వెంకటేశ్వర్లు తదితరులు సన్మానించారు.

బస్సులో దొరికిన నగదు అందజేత



పర్స్, నగదును అందజేస్తున్న డీఎం

ఖమ్మం మామిళ్లగూడెం: బస్సులో దొరికిన పర్స్, నగదును అందజేసిన ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. మోతే మండలం తుమ్మలపల్లికి చెందిన రామసాని వెంకటరెడ్డికి ఇటీవల ఆర్టీసీ బస్సులో ప్రయాణించగా పర్స్ మరిచిపోయాడు. అందులో రూ.5,500 నగదు ఉండగా.. డ్రైవర్ జి.లక్ష్మయ్య పర్స్‌లోని వివరాల ఆధారంగా వెంకటరెడ్డి సమాచారం ఇచ్చి, సోమవారం డీఎం బి.శ్రీనివాస్, సీఐ రామయ్య సమక్షాన ఆయనకు అందజేశారు.

సూర్యాపేట వాసి బలవన్మరణం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ఓ లాడ్జీలో సూర్యాపేటకు చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని సోమవారం రాత్రి గుర్తించిన సిబ్బంది ఖమ్మం వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సూర్యాపేటకు చెందిన అప్పం నిహార్ స్టేషన్ రోడ్డులోని ఓ లాడ్జీలో ఆదివారం గది అద్దెకు తీసుకున్నాడు. ఆయన ఉరి వేసుకుని ఆత్యహత్య చేసుకోగా, పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాల కారణంగా ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,920	1,920
పెసలు	7,900	6,800
కందులు	8.100	4,600
మిర్చి	23,000	16,000
మిర్చి తాలు	14,300	9,000
పత్తి	7,300	5,300

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,781

యూనిఫాం వచ్చేసింది!

- బడి ప్రారంభం రోజే విద్యార్థులకు ఇచ్చేలా ఏర్పాట్లు
- ఇప్పటికే జిల్లాకు చేరుకున్న క్లాత్
- మండలాల వారీగా చేరవేస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేసేలా అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా కొన్నేళ్ల నుంచి విద్యార్థులకు యూనిఫాం ఇస్తోంది. అయితే, ప్రతీసారి విద్యాసంవత్సరం ప్రారంభమయ్యాక యూనిఫామ్ జిల్లాకు వస్తే ఆ తర్వాత విద్యార్థులకు ఇచ్చి కుట్టించే వరకు రెండు, మూడు నెలలు గడిచేది. కానీ ఈసారి మాత్రం విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే దుస్తులు ఇవ్వాలనే నిర్ణయించారు. జిల్లాలోని 1265 ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ స్కూళ్లు, ట్రైబల్ ప్రైమరీ స్కూళ్లు ఉండగా వీటి పరిధిలో 84,856మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికి 4,23,990మీటర్ల క్లాత్ అవసరమవుతుందని నిర్ణయించి జిల్లాకు పంపించారు. జిల్లా కేంద్రం నుంచి మండలాలకు చేరవేస్తుండగా, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి దుస్తులు సిద్ధం చేసి అందించనున్నారు.



నేలకొండపల్లి ఎంఈఓ కార్యాలయానికి వస్త్రాన్ని తీసుకొచ్చిన వాహనం

మార్గదర్శకాలు విడుదల

బాలురు, బాలికలకు సంబంధించిన యూనిఫాం కుట్టించే విధానంపై విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈమేరకు 1, 2, 3వ తరగతుల బాలికలకు బాడీ ఫ్రాక్, షర్ట్ కుట్టడంతో పాటు షర్ట్ చేతులకు ఒక ఇంచుతో పట్టీలు వేయాలి. ఇక 4, 5వ తరగతుల బాలికలకు స్కర్ట్, స్కర్ట్‌కు రెండు ఇంచుల వెడల్పుతో ఎదురు కుచ్చిళ్లు, రెండు ఇంచుల వెడల్పుతో సూటింగ్ క్లాత్ వేయాలి. షర్ట్‌కు రెండు జేబులు ఉండాలి. అలాగే, 6నుంచి 12వ తరగతుల బాలికలకు పంజాబీ డ్రెస్‌లు, 1నుంచి 12వ తరగతుల బాలురకు షర్ట్, ప్యాంట్/నిక్కర్ కుట్టాలి. షర్ట్‌కు రెండు జేబులు కుట్టి పట్టీ వేయాల్సి ఉంది. ఇలా పలు సూచనలు చేస్తూ ఫొటోలను విడుదల చేశారు. కాగా, ఒక్కో జత కుట్టినందుకు ప్రభుత్వం రూ.50చొప్పున ఇవ్వనుండగా.. ఈ ధరకు టైలర్లు ముందుకొస్తారా, లేదో వేచి చూడాల్సి ఉంది.

ఒక్కొక్కరికి రెండు జతలు

ప్రతీ విద్యార్థికి రెండు జతల యూనిఫాం ఇవ్వనున్నారు. గతంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్లాత్ రాకపోయేది. కానీ ఈసారి సరిపడా క్లాత్ తెప్పించడంతో తొలిరోజునే యూనిఫాం ఇచ్చేలా ఏర్పాటు చేస్తున్నారు.



మోడల్ యూనిఫాంలో విద్యార్థులు

అదనంగా వసూలు చేయొద్దు



రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన యూనిఫాంను హెచ్‌ఎం, ఎస్‌ఎంసీల ఆధ్వర్యంలో స్థానిక టైలర్ల ద్వారా కుట్టించాల్సి ఉంటుంది. ఒక్కో జతకు రూ.50చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. అవసరమైన టైలర్లను విద్యాశాఖ తరఫున సమకూరుస్తాం. విద్యార్థుల సంఖ్య ఆధారంగా యూనిఫాం సిద్ధం చేయించాలి.

– రాజశేఖర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్

ముందస్తుగానే యూనిఫాం



ఈ ఏడాది విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా యూనిఫాం క్లాత్‌ను జిల్లాకు కేటాయించింది. ఇప్పటికే క్లాత్‌ను మండలాలకు పంపిస్తున్నాం. అక్కడి నుంచి పాఠశాలలకు పంపించి యూనిఫాం సిద్ధం చేయిస్తాం. తొలిరోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫాం ఇవ్వాలనేది లక్ష్యం

– సోమశేఖర శర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

ఆగిన పెన్షన్లు పునరుద్ధరించండి

- భర్త చనిపోతే భార్యకు వర్తింపజేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో వివిధ కారణాలతో ఆగిపోయిన ఆసరా పెన్షన్లను వెంటనే పునరుద్ధరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలో నిలిచిపోయిన 810 పింఛన్ల వివరాలు పరిశీలించి అర్హులకుపునసరుద్ధరించాలని తెలిపారు. లబ్ధిదారుడైన భర్త మరణిస్తే, భార్యకు పెన్షన్ వర్తింపజేయాలని సూచించారు. అలాగే, ఆధార్ లింక్ కాని పింఛన్లపై దృష్టి సారించాలని, ఒకే ఇంట్లో రెండేసి ఉంటే పింఛన్లు నిలిపివేసినందున ఆ ఇంట్లో దివ్యాంగులు, వృద్ధులు ఉండే తిరిగి ప్రతిపాదనలు ఇవ్వాలని తెలిపారు. కాగా, ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామపంచాయితీల అభివృద్ధికి మంజూరైన రూ.10 లక్షలతో ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

పెండింగ్ మ్యూటేషన్లు పరిష్కరించండి

పెండింగ్ ఉన్న మ్యూటేషన్ల పరిష్కారంపై తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి వీసీ ద్వారా ఆయన మాట్లాడుతూ పెండింగ్ మ్యూటేషన్లపై చర్యలు వేగవంతం చేయాలని, సేల్, గిఫ్ట్, సక్సేషన్ తదితర కేటగిరీల వారీగా కారణాలు సమర్పించాలని తెలిపారు. అలాగే, డొంకల్లో ఆక్రమణల తొలగింపుపై తీసుకుంటున్న చర్యలపై సూచనలు చేసిన ఆయన పంట కోతలు పూర్తికాగానే ఆక్రమణలు తొలగించి రోడ్లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

యూనిట్లపై పర్యవేక్షణ

దళితబంధు యూనిట్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. దళితబంధులో గ్రౌండింగ్ యూనిట్లపై ఆయన సమీక్షించారు. చింతకాని మండలంలో 3,462 మంది లబ్ధిదారులకు గాను 3,385 యూనిట్లు గ్రౌండింగ్ అయినందున, లబ్ధిదారులు లీజ్‌కు ఇవ్వకుండా స్వయంగా నిర్వహించుకునేలా సూచనలు చేశారు. అధికారులు అద్దె వాహనాలు తీసుకునేప్పుడు దళితబంధు యూనిట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, డీఆర్వో శిరీష, డీఆర్డీఓ విద్యాచందన, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, డీపీఎం రేవతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు


మెడికల్ కాలేజీ పనుల్లో వేగం పెంచాలి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాకు మంజూరైన ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు పనుల్లో మరింత వేగం పెంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఈమేరకు పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ కార్యాలయం తదితర భవనాల్లో జరుగుతున్న పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. త్వరలోనే వైద్య కళాశాలకు అనుమతి వచ్చే అవకాశమున్నందున పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. ఆతర్వాత జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో వైద్య సేవలపై కలెక్టర్ సమీక్షించారు. విభాగాల వారీగా లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. కంటి విభాగంలో నెలకు కనీసం 300 శస్త్రచికిత్సలు, జనరల్ వైద్య విభాగంలో 200 శస్త్రచికిత్సలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన సేవలు అందించి నమ్మకం పెంచాలని తెలిపారు. అసిస్టెంట్ శిక్షణ కలెక్టర్ రాధికాగుప్త, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, ఆర్‌ఎంఓ బొల్లికొండ శ్రీనివాసరావు, ఈఈ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్

బందోబస్తుకు ప్రత్యేక ప్రణాళిక



క్యూఆర్ కోడ్‌లో పొందుపరిచిన రూట్ మ్యాప్ (ఇన్‌సెట్) పోలీసులు రూపొందించిన క్యూఆర్ కోడ్

- భక్తుల కోసం ఆన్‌లైన్ రూట్ మ్యాప్
- నిత్యం పర్యవేక్షిస్తున్న ఎస్పీ వినీత్

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో జరిగే గజదభిరాముడి కల్యాణాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు దేశ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీలు, వీవీఐపీలు రామయ్య కల్యాణాల్ను తిలకించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఎస్పీ వినీత్ సోమవారం ఏర్పాట్లను పరిశీలించి, భద్రతకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ మేరకు ప్రత్యేకంగా అన్‌లైన్ రూట్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. ఇందులో సీతారాముల కల్యాణం జరిగే ప్రదేశంతో పాటు భక్తులకు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న సేవలకు సంబంధించిన ప్రదేశాలను వివరంగా తెలియజేశారు. భక్తులకు అందుబాటులో ఉండేలా క్యూఆర్ కోడ్ విడుదల చేశారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే..

తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని స్కాన్ చేస్తే కల్యాణ వేడుక నిర్వహించే మిథిలా స్టేడియం, కారు పార్కింగ్, బస్టాండ్‌కు వెళ్లే దారి, భక్తులకు ఏర్పాటు చేసిన విశ్రాంతి ప్రదేశాలు, తలంబ్రాలు, లడ్డూ కౌంటర్లకు వెళ్లడం ఎలా అనే వివరాలను తెలుసుకోవచ్చు. అలాగే భక్తులతో పాటు వీఐపీలు, వీవీఐపీలకు కేటాయించిన ప్రత్యేక పార్కింగ్ స్థలాలకు వెళ్లే దారులను తెలుసుకోవచ్చు.

మూడు రోజులు పోలీస్ ఆంక్షలు..

శ్రీ సీతారాముల కల్యాణం నేపథ్యంలో భద్రాచలం పట్టణంలో పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. సీఎం కేసీఆర్‌తో పాటు గవర్నర్ తమిళిసై వస్తారనే సమాచారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా భారీ వాహనాలకు మూడు రోజుల పాటు పట్టణంలోకి అనుమతి లేదు. ఈనెల 29 నుంచి 31 వరకు భద్రాచలం పట్టణాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని నిఘా పటిష్టం చేయనున్నారు. ఇందుకోసం ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రతిరోజూ భద్రాద్రికి వచ్చి పోలీసులు అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

బావిలో మహిళ మృతదేహం లభ్యం

ముదిగొండ: ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ వివాహిత బావిలో మృతదేహమై తేలింది. మండలంలోని అమ్మపేట గ్రామానికి చెందిన షేక్ మదార్‌బీ(38) ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ రాలేదు. దీంతో ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలిస్తుండగా, అయ్యగారిపల్లిలోని ఓ వ్యవసాయ బావిలో సోమవారం మృతదేహం లభ్యమైంది. కాగా, ఆమె మృతిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో పోలీసులు చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై నాగరాజు తెలిపారు.

ముగిసిన 'కల్లూరు అప్పయ్య' షూటింగ్

కల్లూరు/ఖమ్మం గాంధీచౌక్: కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటున్న మినీ మూవీ 'కల్లూరు అప్పయ్య' చిత్రీకరణ సోమవారం పూర్తయింది. ఖమ్మంకు చెందిన రచయిత కొత్తపల్లి శేషు దర్శకత్వంలో కల్లూరు శాంతినగర్‌కు చెందిన మిమిక్రీ ఆర్టిస్ట్ నల్లగట్ల కిషోర్‌బాబు, మహేశ్వరి జంటగా 'కల్లూరు అప్పయ్య' పేరిట చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జిల్లాకే చెందిన కళాకారులు మొగిలి గుణాకర్, చెరుకుమల్లి వెంకటేశ్వరరావు, పఠాని మోహనరావు, నాగసాయి, సెంచరి శివ, వంశీ పలు పాత్రలు పోసించారు. ఈ సందర్భంగా రచయిత, దర్శకుడు కొత్తపల్లి శేషు కల్లూరు, ఖమ్మంలో సోమవారం మాట్లాడారు. ఎక్కడా రాజీ పడకుండా తీసిన ఈ చిత్ర నిర్మాణానికి ఎర్రబోయినపల్లి గ్రామస్తులు, అయ్యప్పస్వామి ఆలయ మేనేజర్ ప్రసాద్, అర్చకులు, సిబ్బంది సహకరించారని తెలిపారు. క్రైమ్ సస్పెన్స్ కథాంశంతో ఈ సినిమా ఉంటుందన్నారు. హీరో కిషోర్‌బాబు మాట్లాడగా, కాంద్ర చందు, నాగరాజు, రవి పాల్గొన్నారు.



షూటింగ్‌లో సినిమా బృందం

దారితప్పిన వ్యక్తి కుటుంబసభ్యుల చెంతకు..



రవిని కుటుంబీకులకు అప్పగిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: రెండు నెలల క్రితం ఇంటి నుంచి వచ్చిన మానసిక దివ్యాంగుడిని చేరదీసి ఆరోగ్యం కుదుటపడ్డాక కుటుంబం చెంతకు చేర్చారు. రంగారెడ్డి జిల్లా ఫారూఖ్‌నగర్ మండలం నాగర్లగడ్డ తండాకు చెందిన ఆంగోత్ రవి మద్యానికి బానిసై మానసిక వైకల్యానికి గురికాగా, భార్యాపిల్లలను వదిలేసి బయటకు వచ్చాడు. రెండు నెలల క్రితం ఆయన ఖమ్మం చేరుకుని స్థానికులను ఇబ్బంది పెడుతుండడంతో ఖమ్మం అర్బన్ పోలీసులు గత నెల 27న అన్నం సేవా ఫౌండేషన్‌లో చేర్పించారు. ఆయనకు చికిత్స చేయించడంతో కోలుకోగా తన వివరాలు వెల్లడించారు. దీంతో రంగారెడ్డి జిల్లా పోలీసులు, గ్రామ సర్పంచ్‌కు తెలియజేయగా సోమవారం వచ్చిన రవి తండ్రి చంద్రు, సోదరుడు రతన్‌కు అప్పగించారు.

ఒకరి ఖాతాపై ఇంకొకరికి పాస్ పుస్తకం

రూ.లక్ష మేర డ్రా చేయడంతో బయటపడిన వైనం

నేలకొండపల్లి: బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒకరి పేరిట ఖాతా పుస్తకాన్ని మరొకరికి జారీ చేయడంతో డబ్బులు డ్రా చేసిన ఘటన ఇది. ఈ విషయమై అధికారులను ఖాతాదారుడు నిలదీయడంతో తప్పు సరిదిద్దేందుకు యత్నిస్తున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని బోదులబండకు చెందిన షేక్ మహమ్మద్ పాషాకు నేలకొండపల్లి యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లో ఖాతా ఉంది. ఈ ఖాతాలో రూ.లక్ష వరకు నగదు నిల్వ ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్‌కు కూడా ఇదే బ్యాంకులో ఖాతా ఉండగా తన పాస్‌పుస్తకం పోయిందని గత నెలలో బ్యాంకు అధికారులను సంప్రదించడంతో వివరాలు సరిచూసుకోకుండా షేక్ మహమ్మద్ పాషా పేరిట ఉన్న ఖాతా పాస్ పుస్తకం జారీ చేశారు. ఆ ఖాతాలో నగదు ఉండడంతో షేక్ హమ్మద్ ఖాతా నుంచి రూ. లక్ష నగదు డ్రా చేశాడు. ఈ విషయం పాషా ఫోన్‌కు మెసేస్ రావడంతో ఆయన బ్యాంక్ అధికారులను సంప్రదిస్తే డబ్బులు డ్రా చేసింది నీవేనని వాదించారు. కానీ తాను బ్యాంకుకే రాలేదని స్పష్టం చేయడంతో ఓచర్లు తనిఖీ చేయగా సంతకం పాషాది కాదని తేలింది. దీంతో అధికారులు తప్పును సరిదిద్దే ప్రయత్నం ప్రారంభించారు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ రాజేష్‌ను సోమవారం వివరణ కోరగా సాంకేతిక లోపంతో ఎదురైన సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

పంట నష్టం దిగులుతో రైతు ఆత్మహత్య

తిరుమలాయపాలెం: సాగుచేసి పంట దిగుబడి లేక, అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ రైతు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని పడమటితండాకు చెందిన అజ్మీర రాములు(38) మూడెకరాల్లో పత్తి, మిరప పంటలు సాగుచేశారు. చీడ పీడలతో దిగుబడి రాకపోవడంతో పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గం కానరాలేదు. దీంతో ఈనెల 25న ఆయన పురుగుల మందు తాగగా ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న రాములు సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు భార్య రమాదేవి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, రాములు మృతదేహం వద్ద వైఎస్సార్ టీపీ నాయకుడు సంద్యాల రవీందర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించి ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

భర్త వేధింపులు తాళలేక...

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ మధురానగర్ రోడ్డునెంబర్-1కు చెందిన వివాహిత కె.యమున(29) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కూలీ పనులకు వెళ్లే యమునను ఆమె భర్త నిత్యం తాగొచ్చి అనుమానంతో ఆమెను వేధిస్తున్నాడు. దీంతో సోమవారం ఆమె నివాస గృహంలో ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసిన ఖమ్మం అర్బన్ ఎస్ఐ ఉమ ఇచ్చిన సమాచారంతో యమున మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ బాధ్యులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గ్రామకార్యదర్శి సంతకం ఫోర్జరీ

ఆపై ఇంటి అనుమతులు జారీ

ఖమ్మంరూరల్: గ్రామాల్లో ఎవరైనా ఇల్లు నిర్మించుకోవాలంటే పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకుంటే అన్నీ పరిశీలించి అనుమతి జారీ చేస్తారు. కానీ మండలంలోని ఏదులాపురం గ్రామపంచాయతీ పరిధిలో మాత్రం కార్యదర్శిని సంప్రదించకుండానే అనుమతులు తీసుకోవచ్చు. ఇందుకోసం కొంత ఖర్చు చేస్తే సరిపోతుంది. ఇలా అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తిపై ఫిర్యాదు అందడంతో ఖమ్మం రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు... ఏదులాపురానికి చెందిన పలువురి ఇళ్ల నిర్మాణానికి లక్ష్మారెడ్డి అనే వ్యక్తి కొన్నాళ్ల నుంచి అనుమతి పత్రాలు జారీ చేస్తున్నాడు. ఇందుకోసం గ్రామ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేయడమే కాక, నకిలీ స్టాంప్‌లు తయారుచేసుకున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామకార్యదర్శి నాగరాజు ఫిర్యాదు చేయడంతో సోమవారం లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. కాగా, లక్ష్మారెడ్డి ఇంటి అనుమతి పత్రాలు ఇచ్చేందుకు రూ.వేలు మొదలు రూ.లక్షలు వరకు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

గుడుంబా విక్రయదారుడికి రూ.లక్ష జరిమానా

వైరా: కొణిజర్ల మండలం తుమ్మలపల్లికి చెందిన నూనావత్ రవి నాటు సారా విక్రయిస్తూ పట్టుబడగా రూ.లక్ష జరిమానా విధించారు. గతంలో ఓసారి పట్టుబడిన రవిని బైండోవర్ చేయగా, మళ్లీ సారా అమ్ముతున్నాడు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో తహసీల్దార్ సైదులు సోమవారం జరిమానా విధించారని ఎక్సైజ్ ఎస్సై రమ్యారెడ్డి తెలిపారు.

క్లుప్తంగా...

ఎప్పటిలోగా చెల్లిస్తారు?
ఆర్టీసీని నివేదిక కోరిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగుల సహకార పరపతి సంఘానికి (సీసీఎస్) బకాయిపడ్డ మొత్తంలో ఇప్పటివరకు ఎంత చెల్లించారు.. మిగతాది ఎప్పటిలోగా చెల్లిస్తారో వచ్చే సోమవారంలోగా నివేదికను అందజేయాలని ఆర్టీసీని హైకోర్టు ఆదేశించింది. సీసీఎస్‌కు జమ చేయాల్సిన నిధులను సంస్థ సొంతానికి వాడేసుకోవడంతో వడ్డీ సహా రూ.900 కోట్ల బకాయిలు ఏర్పడ్డాయి. ఫలితంగా ఉద్యోగులకు ఈ సంఘం ద్వారా మంజూరు చేయాల్సిన రుణాలు ఆగిపోయాయి. దీంతో బకాయిల్లో కొంతమొత్తం చెల్లించాలని ఎప్పట్నుంచో ఆ సంఘం కోరుతున్నా ఆర్టీసీ నుంచి స్పందన లేకపోవడంతో సీసీఎస్ ఇటీవలే హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

సాయుధ పోరాటం తెలియని మూర్ఖులు బీజేపీ నాయకులు


నారాయణ

సాక్షి, మహబూబాబాద్: తెలంగాణ సాయుధ పోరాటం గురించి తెలియని మూర్ఖులు బీజేపీ నేతలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అమరుల స్థూపాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం 59జీఓ ద్వారా అత్యధిక డబ్బులు చెల్లించాల్సి వస్తున్న పేదల గుడిసెలను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే సాయుధ పోరాట యోధుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని బీజేపీ చెప్పడం హాస్యాస్పదమన్నారు.

ప్రెజర్‌బాంబు పేలి జవాన్ మృతి


విజయ్ యాదవ్ (ఫైల్)

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలి యూపీకి చెందిన జవాన్ మృతి చెందాడు. బీజాపూర్ జిల్లా భైరంగఢ్ పీఎస్ పరిధిలోని తిమ్నార్ సీఏఎఫ్ క్యాంపుజవాన్లు అడవిలో సోమవారం కూంబింగ్ చేపడుతుండగా కాస్త దూరంలో మావోయిస్టులు ప్రెజర్ బాంబు అమర్చారు. దీన్ని గమనించకుండా సీఏఎఫ్ అసిస్టెంట్ ప్లాటూన్ కమాండర్ విజయ్ యాదవ్ కాలు వేయడంతో బాంబు పేలింది. ఆయన్ను క్యాంపునకు తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందాడు.


మహాభారత యుద్ధం చిత్రాలు


గ్రేటర్ వరంగల్ నగరంలోని మోడల్ హిందూ వైకుంఠధామం వ్యూ

అల..వైకుంఠధామంలో..

పచ్చని గ్రీనరీ.. ఆహ్లాద వాతావరణం ● భగవద్గీతలాంటి ఆధ్యాత్మిక గ్రంథాలతో లైబ్రరీ

- విశాలమైన 4.20 ఎకరాల స్థలం
- చుట్టూ సీసీ కెమెరాలు, ప్రహరీకి సోలార్ ఫెన్సింగ్
- స్మార్ట్ సిటీలో మోడల్‌వైకుంఠధామం
- మహిళా సంఘాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించే అవకాశం


భారీ శివుడి విగ్రహం


వైకుంఠధామంలో లోపల పచ్చని చెట్లు

వరంగల్ డెస్క్: పచ్చటి గ్రీనరీ.. ఐటీ హబ్‌ను తలపించే ముఖద్వారం.. లోపలికి అడుగుపెట్టగానే స్వాగతం పలికే.. వివిధ రకాల కడియం పూల అందాలు.. ఆధ్యాత్మికతను తలపించే శివుడి భారీ విగ్రహం.. కొంచెం లోపలికి వెళ్తే.. సేద దీరేందుకు చెట్లకింద రచ్చబండలు.. విశాలమైన పార్కింగ్ సదుపాయం.. గ్రీనరీ నడుమ అక్కడక్కడ నిర్మాణాలు.. ఇదేదో ఆలయమో.. లేదా సేద దీరే పార్క్ అనుకుంటున్నారా.. కాదండోయ్ స్మార్ట్ సిటీ అయిన వరంగల్ నగరంలోని మోడల్ వైకుంఠధామం. మనిషి చనిపోయాడన్న దుఃఖంతో వచ్చిన వారికి ఆ బాధనుంచి కాస్త ఉపశమనం కలిగేలా అన్ని హంగులు, ఆధునిక సొబగులతో తీర్చిదిద్దారు. నగరంలోనే ఇది మొదటి మోడల్ హిందూ వైకుంఠధామం.

మోడల్ డివిజన్‌లో.. మోడల్ వైకుంఠధామం

వరంగల్ నగరంలోని 57వ డివిజన్‌ను మోడల్ డివిజన్‌గాఎంపిక చేశారు. ఈ డివిజన్ పరిధిలోని వాజ్‌పేయి కాలనీలో పాత శ్మశాన వాటికను మోడల్ వైకుంఠధామంగా ఎంపిక చేశారు. సీఎంఏ నిధులు రూ.4.50 కోట్లతో 2.20 ఎకరాల విస్తీర్ణంలో తీర్చిదిద్దారు. ముఖద్వారం నుంచి నేరుగా లోపలికి వెళ్లేలా దారులు.. ఆ దారుల చుట్టూ కడియం పూల మొక్కలు.. పచ్చటి గ్రీనరీని పెంచారు. బర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లకు వెళ్లే దారిలో సత్యహరిశ్చంద్రుడి జీవిత చరిత్రను చిత్రాలతో పొందుపరిచారు. మరోవైపు మహాభారత యుద్ధ సన్నివేశాన్ని కూడా చిత్రాలతో పొందుపర్చారు. ఇక మనిషికి అవసరమైన నీరు, భూమి, గాలి, అగ్ని, నిర్మలమైన ఆకాశం.. పంచభూతాలను ఒకే దగ్గర కల్పించడం అన్న కాన్సెప్ట్‌తో ఈ వైకుంఠధామాన్ని నిర్మించారు.

పురాతన గ్రంథాలతో లైబ్రరీ

ఈ వైకుంఠధామంలో లైబ్రరీని ఏర్పాటు చేశారు. అందులో భగవద్గీత, మహాభారతంలాంటి గ్రంథాలను అందుబాటులో ఉంచనున్నారు.

నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు కమిటీ ఏర్పాటు

మోడల్ వైకుంఠధామం నిర్వహణ బాధ్యతలను అప్పగించేందుకు కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం మృతదేహాల దహనం బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించారు. మృతదేహాన్ని తీసుకురావడం నుంచి వైకుంఠరథం, పూలు, కర్రలు, దహనం వరకు అన్ని కార్యక్రమాలను వారి నిర్వహణలో చేయాలని భావిస్తున్నారు. ఇక మిగతా గ్రీనరీ బాధ్యతలను ఉద్యానవనశాఖ, ఎలక్ట్రికల్‌ను ఎలక్ట్రికల్ విభాగం, సివిల్ పనులు.. సివిల్ విభాగానికి కేటాయించనున్నారు. ఒక డెడ్‌బాడీ దహనానికి ఎంత చార్జ్ చేస్తారనేది ఇంకా నిర్ణయించాల్సి ఉంది. దీనిని త్వరలో రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మోదీ విధానాలు ప్రమాదకరం


కూనం నేని

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: దేశంలో ప్రస్తుతం చీకటి యుగం నడుస్తోందని.. స్వాతంత్ర్యం కంటే ముందు, ఆ తర్వాత కూడా ఇలాంటి పరిస్థితులు లేవని, బీజేపీ విధానాల కారణంగానే ఇలాంటి దుర్భర పరిస్థితులు దాపురించాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రతిపక్షాల గొంతు నొక్కడానికే ప్రధాని ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వ విధానాలను తప్పుబట్టే నేతలపై నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మోదీ విధానాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ప్రతిపక్షం చెప్పింది వినకూడదనే ధోరణితో బీజేపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందన్నారు.

బీజేపీని అధికారంలోకి రానివ్వబోం


తమ్మినేని

నల్లగొండ: తెలంగాణలో బీజేపీని అధికారంలోకి రానివ్వబోమని, బీజేపీని అడ్డుకునేందుకు లౌకిక, ప్రజాస్వామిక శక్తులను కలుపుకుపోతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్యయాత్ర సోమవారం నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, నకిరేకల్, చిట్యాలలో సాగింది. ఈ సందర్భంగా ఆయా చోట్ల తమ్మినేని మాట్లాడుతూ మునుగోడు శాసనసభ ఉపఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలతో బీఆర్‌ఎస్ పార్టీ కలిసి పనిచేసి విజయం సాధించిన తర్వాత సీఎం కేసీఆర్ ఇప్పటికే పలు బహిరంగసభల్లో కమ్యూనిస్టులతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారని చెప్పారు. రాజ్యాంగ విరుద్ధంగా రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని కేంద్రం రద్దుచేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేంద్రం రాజ్యాంగ పద్ధతులను మార్చి పాలన సాగిస్తోందన్నారు.

సంగారెడ్డిలో యూనివర్సిటీ ఏర్పాటు చేయండి

సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే జగ్గారెడ్డి లేఖ



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖరాశారు. 'సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న 8 నియోజకవర్గాల నుంచి విద్యార్థులు వస్తారు. మెదక్‌తో పాటు తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలకు చెందిన వారు కూడా వస్తారు. సంగారెడ్డిలోని తారా డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం ఆ విద్యార్థులు పీజీ వరకు చదువుకుంటున్నారు. ఆ తర్వాతి చదువులకు మాత్రం హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో కొందరు విద్యార్థులు పీహెచ్‌డీ, ఇతర కోర్సులు చేయలేక మానేస్తున్నారు. తారా డిగ్రీ కళాశాలలో 40 నుంచి 50 ఎకరాల వరకు స్థలం కూడా ఉంది. ఆ స్థలం యూనివర్సిటీకి సరిపోతుంది. సంగారెడ్డిలో యూనివర్సిటీ డిమాండ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి కూడా బాగా వినిపిస్తోంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని వీలున్నంత త్వరలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతున్నా'అని సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖలో జగ్గారెడ్డి కోరారు.

లక్ష రుణ మాఫీ ఏదీ..

భువనగిరిలో మంత్రిని నిలదీసిన రైతు


రైతు రుణమాఫీ ఎప్పుడు అమలు చేస్తారని మంత్రి జగదీశ్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న రైతు హరినాథ్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: సీఎం కేసీఆర్ లక్ష రుణమాఫీ ప్రకటించారు..ఇంకా అమలు కాలేదు..ఎప్పుడు చేస్తారని యాదాద్రి భువనగిరి జిల్లా హుస్నాబాద్‌కు చెందిన రైతు భీరెడ్డి హరినాథ్‌రెడ్డి విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని ప్రశ్నించారు. సోమవారం భువనగిరిలో రైతు సేవా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మహాజన సభలో ప్రసంగించి వేదిక నుంచి దిగుతుండగా రైతు మంత్రి దగ్గరకు వెళ్లి ప్రశ్నించారు. మొన్ననే రూ.లక్ష రుణమాఫీ చేశామని మంత్రి సమాధానమిస్తూ ముందుకు సాగారు. అయితే..రుణమాఫీ విషయాన్ని మైకులో చెప్పాలని రైతు కోరగా..మంత్రి నుంచి స్పందన రాలేదు. దీంతో రైతు హరినాథ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ..సమస్యలు అడిగితే మంత్రి విసుక్కుంటున్నారని, ప్రశ్నిస్తే ప్రతిపక్షం అంటున్నారని మండిపడ్డాడు.

అక్కడ ఆ పథకాలు అమలైతే | రాజకీయ సన్యాసం

సవాల్ విసిరిన స్పీకర్ పోచారం
- తెలంగాణ తరహా సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నాయా అని ప్రశ్న?


మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నట్లు చూపిస్తే తాను రాజకీయ సన్యాసం చేస్తానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సవాలు విసిరారు. సోమవారం రాత్రి కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. తాను స్పీకర్ హోదాలో రాలేదని, ఒక ఎమ్మెల్యేగా సమ్మేళనానికి వచ్చానన్నారు. దేశంలోని బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చూపిస్తే వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయనన్నారు. ఇటీవల బాన్సువాడకు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తనపై, తన కుటుంబ సభ్యులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చాలా బాధించాయన్నారు. 'హైదరాబాద్‌లో భూ కబ్జాలకు పాల్పడే వ్యక్తి, ఓ బడా చోర్, నీ వెంట బాన్సువాడలో ఉన్న చోటా దొంగలు కలిసి ఆరోపణలు చేయడం సిగ్గు చేటని'ధ్వజమెత్తారు. తనపై, తన కుమారులైన పోచారం సురేందర్‌రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డిలపై ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, వెంట పడి తరుముతామని హెచ్చరించారు. స్వచ్ఛమైన జీవితం నుంచి వచ్చానని, అవసరమైతే బిచ్చమెత్తుకుంటా కానీ తప్పు చేయనని స్పీకర్ పోచారం కన్నీరు పెట్టుకున్నారు.

జిల్లా వార్తలు

సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండర్‌కు ప్రెసిడెన్షియల్ అవార్డు


అవార్డు అందుకుంటున్న సింగరవేల్ (ఎడమ)

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని 141 సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.సింగరవేల్ రాష్ట్రపతి ప్రెసిడెన్షియల్ అవార్డు అందుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్పూర్ పరిధి చరణ్‌పూర్‌లో సీఆర్పీఎఫ్ డీజీ డాక్టర్ సంజయ్‌లాల్ థామస్ సోమవారం ఆయనకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా భద్రాచలం 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ దార్‌తో పాటు ఉద్యోగులు సింగరవేల్‌ను అభినందించారు.

ఈనెల 31న సింగరేణి డైరెక్టర్ల సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం ఈనెల 31న జరగనుంది. నూతన గనులు, పాత గనుల పొడిగింపు, ఓబీ తొలగింపు టెండర్లు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు సమాచారం. అలాగే, పర్యావరణ అనుమతులు, రవాణా అంశాలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తి, రానున్న ఏడాది లక్ష్యాలు, సోలార్, థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై చర్చించి నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది.

మిర్చి ధర తిరోగమనం
వారం వ్యవధిలో రూ.2,550 పతనం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర తిరోగమనంలో సాగుతోంది. వారం రోజులుగా క్రమక్రమంగా ధర పతనమవుతూ వస్తోంది. ఈనెల 20వ తేదీన క్వింటా రూ.25,550 పలికిన ధర, 23న రూ.24,650, 24న రూ.24,000కు పడిపోగా.. సోమవారం రూ.23,000కు చేరింది. ఇక రూ.23 వేలకు పైగా నమోదైన మోడల్ ధర ప్రస్తుతం రూ.20 వేలకు పడిపోయింది. అలాగే, కనిష్ట ధర రూ.16 వేలుగా పలుకుతోంది. తాలు మిర్చి ధర మాత్రం క్వింటాకు రూ.14 వేలుగా కొనసాగుతోంది. సోమవారం ఖమ్మం మార్కెట్‌కు 37,660 బస్తాల మిర్చి విక్రయానికి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, మిర్చి ధర నానాటికీ తగ్గుతుండడంతో రైతుల్లో ఆశలు గల్లంతవుతున్నాయి. వారం క్రితం ధర పుంజుకోవటంతో రైతులు పంట విక్రయానికి మొగ్గుచూపడంతోనే వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

జూన్ తర్వాతే ఎన్నికలు


కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి యాజమాన్యం పిటీషన్‌పై హైకోర్టు ఉత్తర్వులు
- వచ్చే నెల 2న డీవైసీఎల్సీ వద్ద యాజమాన్యం,కార్మిక సంఘాల భేటీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణపై యాజమాన్యం దాఖలు చేసిన పిటీషన్‌ను పరిశీలించిన రాష్ట్ర హైకోర్టు జూన్ తర్వాత ఎన్నికలు నిర్వహణకు అనుమతించింది. సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి నాలుగేళ్లు పూర్తయి ఏడాదిన్నర దాటినందున ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ నాయకులు గత ఏడాది అక్టోబర్‌లో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలని నవంబర్ చివరి వారంలో తీర్పునిచ్చింది. అయితే, సింగరేణి సంస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తికి ఎంచుకున్న లక్ష్యంలో వెనుకబడినందున, కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో ఉత్పత్తికి అనుకూలంగా ఉంటుందని చెబుతూ ఆతర్వాత ఎన్నికల నిర్వహణకు అనుమతించాలని సింగరేణి యాజమాన్యం కోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. అలాగే, డీవైసీఎల్సీ కూడా బ్యాలెట్ బాక్స్‌ల ఏర్పాటు, సిబ్బంది కేటాయింపు, కార్మికుల సభ్యత్వాల పరిశీలనకు సమయం పడుతుందని కోర్టుకు వివరణ ఇచ్చినట్లు సమాచారం. దీంతో పరిశీలించిన కోర్టు జూన్ నెల ఎన్నికల నిర్వహణకు అనుమతిస్తూ ఈనెల 23న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఎన్నికల నిర్వహణపై చర్చించేందుకు వచ్చే నెల 2వ తేదీన డీవైసీఎల్సీ వద్ద సింగరేణి యాజమాన్యం, అధికారులు, జాతీయ కార్మిక సంఘాల నేతలు భేటీ కానున్నారు. అయితే, జూన్‌లోగా రాష్ట్రంలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే మాత్రం సింగరేణి ఎన్నికలు మరికొంత కాలం వాయిదా పడే అవకాశముందని తెలుస్తోంది.

కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలు



సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలను రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు నిర్వహిస్తాం. ఏప్రిల్, మే ఉత్పత్తికి అనువైన సమయం కావడంతో లక్ష్యసాధనలో మూడో వంతు సాధించే అవకాశముంటుంది. ఈ సమయంలో బొగ్గుకు డిమాండ్ కూడా ఎక్కువే. జూన్ తర్వాత వర్షాలతో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుంది. ఈమేరకు జూన్‌లో ప్రక్రియ ప్రారంభించి ఎన్నికలు నిర్వహించేందుకు మేం సిద్ధమే.

– ఎస్.బలరాం, సింగరేణి డైరెక్టర్ (పా)

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


దర్బార్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏపీఓ డేవిడ్ రాజ్

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ఏపీఓ జనరల్

భద్రాచలం: ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా దరఖాస్తులను యూనిట్ అధికారులకు అందచేసి అర్హతల మేరకు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ అర్హులైన ప్రతీ గిరిజనుడికి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఎస్సెస్సీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తాం

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ఎస్సెస్సీ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్ నుంచి గురుకులాల ఉన్నతాధికారులు వీసీ ద్వారా మాట్లాడగా ఆయన ఐటీడీఏ పరిధిలో చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఈసమావేశంలో డీడీ రమాదేవితో పాటు అధికారులు భాస్కరన్, రమణయ్య, ప్రభాకర్‌రావు, మునీర్ పాషా, ఆర్.శ్రీనివాస్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెక్రటేరియట్ కమాండెంట్‌గా సత్తుపల్లి వాసి


సీఎస్ శాంతికుమారికి పుష్పగుచ్ఛం ఇస్తున్న త్రినాథ్

సత్తుపల్లి: తెలంగాణ సెక్రటేరియట్ కమాండెంట్ అధికారిగా సత్తుపల్లికి చెందిన నరుకుళ్ల త్రినాథ్ పదోన్నతిపై నియమితులయ్యారు. ప్రస్తుతం అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు ఎస్పీ కేడర్‌తో పదోన్నతి కల్పించారు. ఈమేరకు సోమవారం ఆయన చీఫ్ సెక్రటరీ శాంతికుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. 2013 నుంచి సెక్రటేరియట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న త్రినాథ్ విధినిర్వహణలో పలు పురస్కారాలు అందుకున్నారు. సత్తుపల్లిలోని బండి శోభనాచలం కళాశాలలో ఇంటర్, జేవీఆర్ కళాశాలలో డిగ్రీ, ఓయూలో పీజీ చేసిన త్రినాథ్‌కు పదోన్నతి లభించడంపై సత్తుపల్లి వాసులు హర్షం వ్యక్తం చేశారు.

జీఎస్టీ చైర్మన్‌తో ఎంపీ నామ భేటీ

ఖమ్మం పత్తి వ్యాపారుల సమస్యలపై వినతి


జీఎస్టీ చైర్మన్ వివేక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ నామ, వ్యాపారులు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఆధ్వర్యాన ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఢిల్లీలో జీఎస్టీ చైర్మన్ వివేక్ జోహీని సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఖమ్మం పత్తి వ్యాపారులు అవగాహన లేక 2017 నుంచి 2019 వరకు పాత పద్ధతిలో జీఎస్టీ చెల్లించగా, 2019 నుంచి ముడి పత్తి అమ్మకాలు, కొనుగోళ్లపై కూడా జీఎస్టీ చెల్లించారని తెలిపారు. కానీ పాత బకాయిలు కూడా చెల్లించాలని నోటీసులు ఇచ్చి నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. దీంతో జీఎస్టీ చైర్మన్ సానుకూలంగా స్పందించి, సమస్యను పరిష్కరిస్తానని చెప్పారని ఎంపీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో వెల్లడించాయి. ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావుతో పాటు బాధ్యులు సోమా నరేష్‌కుమార్, తల్లాడ రమేష్, నల్లమల ఆనంద్, చెరుకూరి సంతోష్‌కుమార్ తదితరులు ఎంపీ వెంట ఉన్నారు.

'ఆరోగ్య మహిళ'పై విస్తృత ప్రచారం

స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ బిందు


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బిందు

మహబూబాబాద్ అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ పథకంపై విస్తృత ప్రచారం చేయాలని మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు సూచించారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో నాలుగు, ఏడో స్థాయీ సంఘాల సమావేశం సోమవారం జరగగా ఆమె మాట్లాడారు. మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పథకం ద్వారా మెరుగైన వైద్యం అందుతోందని చెప్పారు. జిల్లాలో మొదటి విడతగా తొర్రూరు, దంతాలపల్లి, కురవి, గంగారం, గూడూరు మండలం అయోధ్యపురం పీహెచ్‌సీల్లో ప్రతీ మంగళవారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల 69రకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తారనే విషయాన్ని ప్రచారం చేయాలని తెలిపారు. అలాగే, స్థాయీ సంఘాల సమావేశాలకు హాజరుకాని ఐటీడీఏ, జాతీయ రహదారుల ఈఈలకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా విద్యార్థులను సిద్ధం చేయాలని, గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పెండింగ్ పనులు పూర్తిచేయాలని పేర్కొన్నారు. అలాగే, పంటలకు సాగునీటి సరఫరాపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎం.డీ.ఖాసీం, జెడ్పీటీసీలు భూక్యా సంగీత, జాటోత్ ఝాన్సీలక్ష్మి, జెడ్పీ సీఈఓ రమాదేవి, డిప్యూటీ సీఈఓ నర్మద, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మం నెహ్రూనగర్‌లోని పెన్షనర్ల భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీనెల మొదటి వారంలో పింఛన్ అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. అలాగే, కేంద్రప్రభుత్వ ఉద్యోగులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మూడు డీఏలు విడుదల చేయాలని, ఆరోగ్యకార్డుల ద్వారా అన్ని ఆస్పత్రుల్లో చికిత్సకు అవకాశం కల్పించడమే కాక మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కల్యాణం కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చంద్రశేఖర్, శరత్‌బాబు, ఎం.సుబ్బయ్య, డీ.కే.శర్మ, మారంరాజు రాధాకృష్ణారావు, రమేష్, హన్మంతరావు, ఆంజనేయులు, రామస్వామి, వెంకటరెడ్డి, చెంచిరెడ్డి, జనార్దన్‌రావు, ఉపేందర్‌రావు, వీరన్న, వేణు, పద్మావతి, రాజారావు, బాబురావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.